క్లుప్తంగా

ఇఫ్తార్ విందు



జుమ్మా మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఖలీల్అహ్మద్

నెల్లూరు(బృందావనం): నగరంలోని 44వ డివిజన్ శిఖరంవారివీధిలో ఉన్న జుమ్మా మసీదులో రంజాన్ మాసం సందర్భంగా నగర నియోజకవర్గ అభ్యర్థి ఎం.డి.ఖలీల్అహ్మద్ మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నీలి రాఘవరావు, వేలూరు మహేష్, షేక్ కరీముల్లా, మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి హంజా హుస్సేనీ, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మీరా మొహిద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు అతహర్‌బాషా, అలీం, జియా ఉల్ హక్, మౌలానా అజీజ్, ఆసిఫ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు ఏర్పాటు

ఆత్మకూరురూరల్: ఈ నెల 25న పౌర్ణమిని పురస్కరించుకుని అరుణాచలం గిరిప్రదక్షణకు వెళ్లే భక్తుల కోసం ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక సూపర్‌లగ్జరీ బస్సు ఏర్పాటు చేశామని డిపో మేనేజరు కరీమున్నీసా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీ ఉదయం 8 గంటలకు ఆత్మకూరు డిపో నుంచి ఈ బస్సు అరుణాచలం బయలుదేరుతుందని రాను పోను ఒక్కో టిక్కెట్ ధర రూ.1400 నిర్ణయించామన్నారు. మార్గమధ్యంలో కాణిపాకం, సిరిపురం, అరుణాచలం గిరి ప్రదక్షణకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. వివరాలకు డిపో మేనేజరు 9959225645, సీఐ 9966009395, బస్ కండక్టర్ 8555929504 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాసులు

ఆత్మకూరు: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన ఘటన పట్టణంలో చెర్లోయడవల్లి అడ్డరోడ్డు సమీపంలో మంగళవారం జరిగింది. బాధితుల సమాచారం మేరకు.. శ్రీనివాసులు (24) చెర్లోయడవల్లి రోడ్డు నుంచి బైక్‌పై నెల్లూరుపాళెం వస్తున్నాడు. అదే సమయంలో అతనికి ఎదురుగా ఎస్‌కే మస్తాన్ బైక్‌లో వస్తుండగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. శ్రీనివాసులు తలకు తీవ్ర గాయాలు కావడంతో సమీపంలోని వారు బాధితుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకు తరలిస్తున్నట్లు డాక్టర్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి పనుల తనిఖీ



ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకట్రావు

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లిలో జరుగుతున్న చెక్ డ్యామ్ పనులను డ్వామా పీడీ వెంకట్రావు మంగళవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మర్రిపా డు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించారని, దీంతో అదనంగా 50 రోజులు పని దినాలు పెరిగాయన్నారు. ప్రతి ఒక్కరూ కొలతల ప్రకారం రోజుకు సగటున రూ.272 కూలి వచ్చే విధంగా పని చేయాలని సూచించారు. వేసవి ప్రారంభమైన నేపథ్యంలో కూలీలు ఉదయాన్నే వచ్చి పని చేసుకుని త్వరగా ఇంటికి వెళ్లాన్నారు. ఉద్యానశాఖ ద్వారా నిమ్మ, మామిడి, బత్తాయి చెట్లు అందజేస్తున్నామని, ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓ నారాయణ, ఈసీ మల్లికార్జున, టీఏ రవీంద్ర, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.230

కలిగిరి: కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.230 లభించింది. జనరల్ క్లస్టర్ రైతులు 250 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 224 బేళ్లను కొనుగోలు చేశారు. 26 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ మాట్లాడుతూ కిలో పొగాకుకు కనిష్టంగా రూ.221 పలకగా, సగటున రూ. 229.42 లభించిందన్నారు. వేలంలో 14 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు

- ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ సుబ్బరాజు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్) ఎన్‌వీఎస్ సుబ్బరాజు హెచ్చరించారు. నగరంలోని ఆటో నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్‌లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ ఫీడర్లను పరిశీలించి ఎంత కెపాసిటీ, ఎంత విద్యుత్ లోడ్ వస్తుందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సబ్‌స్టేషన్‌లో ఓవర్ లోడ్స్ ఏమైనా ఉన్నాయా అని తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్స్ మెయిన్‌టెన్స్ కచ్చితంగా చేపట్టాలని, అలా చేపట్టకుండా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే దాని మరమ్మతులకు అయ్యే ఖర్చు సంబంధిత అధికారులే భరించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సంస్థకు రావాల్సిన విద్యుత్ బకాయిలపై దృష్టి సారించాలని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎల్‌సీ(లైన్ క్లియర్)తీసుకునే సమయంలో ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకుని లైన్ల మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట జిల్లా ఎస్‌ఈ విజయన్, నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ ఉన్నారు.



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ సుబ్బరాజు

మర్యాదపూర్వకంగా..



ముఖ్యమంత్రితో మాల్యం సుధీర్‌కుమార్‌రెడ్డి



సీఎంను కలిసిన సన్నపురెడ్డి పెంచలరెడ్డి

నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మాల్యం సుధీర్‌కుమార్‌రెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీ గెలుపునకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు.

ములుముడిలో ఎన్నికల ప్రచారం

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని ములుముడి పంచాయతీ హరిజనవాడ, అరుంధతీయవాడలలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి గెలుపు కోసం ఆ పార్టీ నాయకులు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకునేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మస్తాన్‌యాదవ్, పెంచలయ్య, రామకృష్ణ, స్వర్ణ జీవన్‌ప్రసాద్, అరవ కామాక్షమ్మ, సీహెచ్ ఉషారాణి, చెంతాటి ఉషారాణి, కాపు నాగలక్ష్మి, అరవమని నందిని, విజయ తదితరులు పాల్గొన్నారు.

షార్ కాలనీలో..

నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి విజయాన్ని ఆకాంక్షిస్తూ రూరల్ నియోజకవర్గంలోని 20వ డివిజన్ కొండాయపాళెం షార్ కాలనీలో ఆ డివిజన్ ఇన్‌చార్జి తాళ్లూరు సురేష్‌బాబు ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో క్లస్టర్ -2 ఉపాధ్యక్షుడు దువ్వూరు భాస్కర్‌రెడ్డి, కొండూరు దిలీప్‌కుమార్ రెడ్డి, షేక్ రసూల్, కట్ట ఏడుకొండలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వైఎస్సార్‌సీపీలో మలిరెడ్డి కోటారెడ్డి చేరిక



సీఎం వైఎస్ జగన్, ఎంపీ ఆదాల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన మలిరెడ్డి సోదరులు

నెల్లూరు సిటీ: ప్రముఖ న్యాయవాది, రంజీ మాజీ క్రికెటర్ మలిరెడ్డి కోటారెడ్డి ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆయనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన సందర్భంగా మలిరెడ్డి సోదరులను ముఖ్యమంత్రి అభినందించారు. అలాగే ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సైతం మలిరెడ్డి సోదరులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

పోలీసులకు పతకాలు

నెల్లూరు(క్రైమ్): విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన పలువురు పోలీసు అధికారులు, సిబ్బందికి ఈ ఏడాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం పతకాలను ప్రకటించింది. నెల్లూరు సీఐడీ డీఎస్పీ కె.వేణుగోపాల్ ఉత్తమ సేవాపతకం, ఉదయగిరి సీఐ వి.గిరిబాబు, స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ ఎ.మల్లికార్జునరావు, దర్గామిట్ట హెడ్ కానిస్టేబుల్ జి.భాస్కర్‌రావు, చిన్నబజారు హెడ్ కానిస్టేబుల్ బి.వి.వినోద్‌కుమార్, కావలి ఫైర్‌మన్ సీహెచ్ నారాయణలకు సేవా పతకాలను ప్రభుత్వం ప్రకటించింది. వీరు ఈ పతకాలను అందుకోనున్నారు.

నేత్రదానం



నేత్రదాత జయ రామిరెడ్డి (ఫైల్)

నెల్లూరు(అర్బన్): నగరంలోని గోమతినగర్‌కు చెందిన పూనూరు జయ రామిరెడ్డి(88) మంగళవారం తెల్లవారుజామున తన నివాసంలో మృతి చెందారు. నేత్రదాన మోటివేటర్, మన సేవా సంస్థ వ్యవస్థాపకుడు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి సమాచారంతో జయరామిరెడ్డి కుటుంబసభ్యుల అంగీకారంతో ఆయన నేత్రాలను ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఐ డొనేషన్ కౌన్సిలర్ బాలాజీసింగ్, ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్‌ను అందించారు.

గంగమ్మ ఆలయంలో చోరీ యత్నం



సోమశిల: పంచలోహ విగ్రహాల అపహరణ కోసం దుండగులు విఫలయత్నం చేశారు. ఈఘటన అనంతసాగరం మండలం ఆమనిచిరువెళ్ల చెరువు కట్ట సమీపంలో ఉన్న గంగమ్మ ఆలయంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. పలువురు దుండగులు ఆమనిచిరువెళ్లలోని గంగమ్మ ఆలయంలోకి చొరబడ్డారు. తొలుత హుండీని ఎత్తుకెళ్లి అందులో నగదు లేకపోవడంతో హుండీని బయటపారేశారు. ఆలయంలోని బీరువాలో ఉన్న చీరలు, వస్తువులను చెల్లాచెదురు చేశారు. ఆలయంలోని పంచలోహ విగ్రహాల అపహరణకు ప్రయత్నించారు. గర్భగుడిలోకి వెళ్లడానికి మూడు ఇనుప గ్రిల్ గేట్లు ఉండడంతో వాటిలో రెండింటిని కట్ చేశారు. ఈలోగా స్థానికులు రావడంతో దుండగులు పరారీ అయ్యారు. ఈ ఘటనపై గ్రామస్తులు పోలీసుకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణలను అడ్డుకున్న ఇరిగేషన్ అధికారులు

ఆత్మకూరు: పట్టణంలోని టిడ్కో గృహ సముదాయాల వద్ద ఇరిగేషన్ శాఖ స్థలంలో ఓ మసీదు నిర్మాణం కోసం ప్రయత్నిస్తుండగా మంగళవారం అధికారులు అడ్డుకున్నారు. ఆ ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని, గతంలోనే వారికి చెప్పినా తిరిగి నిర్మాణ పనులు చేయిస్తుండడంతో అడ్డుకున్నట్లు సంబంధిత శాఖ సిబ్బంది పేర్కొన్నారు. అది ఇరిగేషన్ స్థలమని బోర్డు ఏర్పాటు చేశారు.

మానసిక దివ్యాంగులకు మందుల పంపిణీ

నెల్లూరు(అర్బన్): నగరంలోని మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న ఇండియన్ రెడ్‌క్రాస్ ఎంఎస్‌ఆర్ స్పాస్టిక్ సెంటర్‌లోని 65 మంది మానసిక దివ్యాంగ విద్యార్థులకు మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బీఎస్‌ఆర్ హోమియో ఆస్పత్రి ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీనివాసరావు బృందం మెడికల్ క్యాంపు నిర్వహించి పిల్లలను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. భవిష్యత్‌లో మరిన్ని ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఎంసీ మెంబర్ దాసరి రాజేంద్రప్రసాద్, కార్యదర్శి మస్తానయ్య, కోకన్వీనర్ బలరామయ్య, ప్రిన్సిపల్ గురునాథం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

ట్రైనింగ్ ఏర్పాట్ల పరిశీలన

నెల్లూరు(సెంట్రల్): నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాలలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సిబ్బందికి ఇచ్చే శిక్షణ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్, రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి 570 మంది సిబ్బంది హాజరుకానున్నారని తెలిపారు. శిక్షణకు హాజరయ్యే వారికి ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ శర్మద, సిటీ ప్లానర్ కుమారి, ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.



ఎన్నికల నియమావళి పాటించాలి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(సెంట్రల్): సార్వత్రిక ఎన్నికల నియమావళి కచ్చితంగా పాటించేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని రిటర్నింగ్ అధికారి, మున్సిపల్ కమిషనర్ వికాస్‌మర్మత్ పేర్కొన్నారు. నెల్లూరులోని కమాండ్ కంట్రోల్ రూంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనల మేరకు ప్రచారాలు చేసుకోవాలన్నారు. ప్రధానంగా పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల వరకు ఏ రాజకీయ పార్టీల కార్యాలయాలు ఏర్పాటు చేయకూడదన్నారు. అనుమతుల మేరకే ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పశువులు రోడ్లపై సంచరిస్తే చర్యలు

నెల్లూరు(సెంట్రల్): నగరంలో ఎక్కడైనా పశువులను రోడ్లపై ఉంచి వాహనదారులను ఇబ్బందులు పెడితే పశువుల యజమానులపై చర్యలు తప్పవని ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ హెచ్చరించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ పలు ప్రాంతాల్లో రోడ్లపై ఉన్న పశువులను కల్లూరుపల్లి గోశాలకు తరలించామని తెలిపారు. పశువుల యాజమానులు వాటిని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. కాగా పారిశుద్ధ్య నిర్వహణ ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నట్లు తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ప్రధానంగా దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ సురేంద్ర, ఇన్‌స్పెక్టర్లు షరీఫ్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.



పశువులను గోశాలకు తరలిస్తున్న అధికారులు

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): నిద్రలేమితో బాధపడుతున్న ఓ వృద్ధురాలు నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు.. ఉస్మాన్‌సాహెబ్‌పేటలో విశ్రాంత ఉద్యోగి మురళీధర్ – ఉమాదేవి దంపతులు నివాసం ఉంటున్నారు. ఉమాదేవి గత కొంతకాలంగా నిద్రలేమితో బాధపడుతున్నారు. మందులు వాడుతున్నా ఫలితం లేదు. దీంతో మనస్థాపానికి గురైన ఆమె తన భర్త కన్నా తానే ముందు చనిపోవాలని మంగళవారం ఇంట్లోని గ్యాస్‌ట్యూబ్‌ను కాల్చింది. దీంతో మంటలు వ్యాపించడంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన మురళీధర్ జరిగిన విషయాన్ని తన భార్య చెల్లెలు మంజువాణికి తెలియజేశారు. ఇద్దరూ కలిసి ఉమాదేవిని చికిత్సనిమిత్తం అపోలో హాస్పిటల్‌లో చేర్పించారు. ఈ మేరకు ఆమె నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు నీటిసరఫరాకు అంతరాయం

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని శ్రీఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంతంలో పెట్రోల్ బంక్ పక్కన ఉన్న తాగునీటి పైపులైన్ మరమ్మతుల కారణంగా బుధవారం సాయంత్రం వరకు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు కమిషనర్ వికాస్‌మర్మత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి యథావిధిగా నీటిసరఫరా ఉంటుందని తెలిపారు. ఈ విషయాన్ని ఆ ప్రాంత ప్రజలు గమనించాలని తెలిపారు.

జగనన్నను మళ్లీ సీఎంను చేసుకుందాం

- ఎండీ ఖలీల్అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 3వ డివిజన్ దస్తగిరినగర్, సాదావారిపాళెం, లక్ష్మీవిఘ్నేశ్వరనగర్ తదితర ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర నియోజకవర్గ అభ్యర్థి ఎం.డి.ఖలీల్అహ్మద్ మంగళవారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంట్లో ఏదో ఒక విధంగా లబ్ధి చేకూరుతుండడంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు ఉత్సాహంగా ఉన్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు నగర నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. గత ప్రభుత్వంలో ఏ మాత్రం అభివృద్ధి జరిగిందో, తమ ప్రభుత్వం వచ్చిన తరువాత ఎంత అభివృద్ధి జరిగిందో ప్రజలందరికీ తెలుసన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంక్రాంతి అశ్విని, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఖలీల్అహ్మద్

సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించండి

చేజర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి కుటుంబానికి కులమతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందించారని, రానున్న ఎన్నికల్లో సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించాలని స్థానిక నాయకులు ఓటర్లను కోరారు. మంగళవారం సాయంత్రం మండలంలోని మడపల్లి దళితవాడలో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జేసీఎస్ కన్వీనర్ పూనూరు బాలగంగాధర్ రెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు నుంచి ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మడపల్లి ఎంపీటీసీ పూనూరు భారతి, వైఎస్సార్‌సీపీ నాయకులు వర్లపల్లి పెంచలయ్య, ఎల్ వసంత, జె.కొండయ్య పాల్గొన్నారు.



మడపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

బిట్రగుంట: ప్రసిద్ధ కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి పంచాహ్నిక బ్రహ్మోత్సవాలకు మంగళవారం రాత్రి వైఖానస ఆగమోక్తంగా అంకురార్పణ చేశారు. ఆలయ ప్రధానార్చకులు వీపూరి సత్యనారాయణాచార్యులు, ఆలయ పాలకమండలి చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి, ఈఓ రాధాకృష్ణ ఆధ్వర్యంలో అర్చక బృందం విశ్వక్సేనుని పూజతో అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆలయ ఆవరణలోని పుట్టమట్టిని సేకరించి దానిపై పాలాభిషేకంతో చెమ్మగిల్లిన నవధాన్యాలను చల్లి మట్టితో కప్పారు. అనంతవిశ్వానికి, మానవ మనుగడకు ప్రకృతే ఆధారమని చాటే పరమార్థంతో అంకురార్పణకు శ్రీకారం చుట్టారు. పుట్టమట్టిలో ఉంచిన నవధాన్యాలు సకాలంలో మొలకెత్తే విధంగా జిల్లేడు ఆకులను కప్పి ప్రత్యేక పూజలు చేశారు. అంకురార్పణకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం నుంచి మెట్ల పూజలో పాల్గొన్న మహిళలు అంకుర్పాణ అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్వర్ణవర్ణం సర్వశ్రేష్టం

బ్రహ్మోత్సవాల అంకురార్పణలో భాగంగా పుట్టమట్టితో కప్పిన నవధాన్యాలు మొలకెత్తే వర్ణం ఆధారంగా ఉత్సవాల శ్రేష్టత ఆధారపడి ఉంటుందని ఆలయ ప్రధానార్చకులు వీపూరి సత్యనారాయణాచార్యులు తెలిపారు. అంకురార్పణలో ఉంచిన ధాన్యాలు స్వర్ణవర్ణంలో మొలకెత్తితే ఉత్సవాలు సర్వోత్తమంగా, శ్వేత వర్ణంలో మొలకెత్తితే మధ్యమంగా, చిత్రవర్ణంలో మొలకెత్తితే అధమంగా ఉంటాయని వివరించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం తిరుమంజనం, రాత్రికి ధ్వజారోహణ (కొడిముద్దలు), శేషవాహన సేవ, పూలంగి సేవ నిర్వహించనున్నట్లు ఆలయ పాలక మండలి చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి తెలిపారు.



అంకురార్పణ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు